క్లుప్తంగా

మంత్రికి శుభాకాంక్షలు



పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో శనివారం రామచంద్రాపురం కార్పొరేటర్ బి.పుష్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయదశమి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి దామోదరను కలిసిన మాజీ కౌన్సిలర్

జోగిపేట(అందోల్): మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలోని నివాసంలో కలిసి నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, శనివారం కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. జోగిపేట పట్టణ కాంగ్రెస్ నాయకుడు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎ.చిట్టిబాబు నేతృత్వంలో స్థానిక ఎస్సీ, మైనార్టీ సెల్ నాయకులు మంత్రికి శాలువా కప్పి స్వీట్లు తినిపించారు. ఆత్మకమిటీ డైరెక్టర్ ఖాలేద్, ఎస్సీ సెల్ నాయకులు పోచయ్య, రామకృష్ణ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

వట్‌పల్లి తహసీల్దార్‌గా జంగేశ్వర్



వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి తహసీల్దార్‌గా జంగేశ్వర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్‌కు తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. టీఎస్ఐబీసీ హైదరాబాద్‌లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జంగేశ్వర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం జంగేశ్వర్ మాట్లాడుతూ.. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భూభారతి, ఇతర సర్టిఫికేట్లు, వివిధ అవసరాల కోసం వచ్చేవారు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కిటకిటలాడిన ఆలయాలు



బారులుతీరిన భక్తులు

నారాయణఖేడ్: మండలంలోని పలు హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. కొండాపూర్‌లోని విశిష్ట చరిత్ర గల హనుమాన్ ఆలయం, డోవురులొంక హనుమాన్ ఆలయం, ఖేడ్ కల్వనా ఆంజనేయ స్వామి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు బారులుతీరి హనుమాన్ ప్రతిమలను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో పలు ఆధ్యాత్మిక, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

అభ్యర్థుల ఎంపికపై సమావేశం



కార్యకర్తలతో సమావేశమైన అడ్‌హాక్ కమిటీ సభ్యులు

జహీరాబాద్: ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభ్యర్థుల ఎంపిక సమావేశం నిర్వహించారు. శనివారం మండలంలోని శేఖాపూర్ గ్రామంలో మాజీ మంత్రి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు పార్టీ మండల అడ్‌హాక్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆసక్తి ఉన్న ముగ్గురు అభ్యర్థుల పేర్లను సేకరించి అధిష్టాన వర్గం పరిశీలనకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశావహుల పేర్లను సేకరించారు. సమావేశంలో అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు ఎం.జి.రాములు, సభ్యులు నాగిశెట్టి రాథోడ్, వెంకట్‌రెడ్డి, జనార్దన్, చస్మోద్దీన్, రవి చౌహాన్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కోతుల దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. చిన్నారులు ఆరుబయట ఆడుకుంటుండగా.. కోతులు చిన్నారి కృతికపై దాడి చేశాయి. వెంటనే స్థానికులు కోతుల మందను తరిమేశారు. అయితే కోతుల దాడిలో చిన్నారి కృతికకు కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతులను నివారించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు పంచాయతీ ఆఫీస్ వద్ద ఆందోళన చేపట్టారు.

ఫసల్ బీమాతో ప్రయోజనం



వర్షానికి దెబ్బతిన్న పత్తి పంట



కంది పంటలో నిలిచిన వరద

- మళ్లీ పథకం ప్రారంభించాలని డిమాండ్
- ప్రీమియం చెల్లింపు నిలిపేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

మునిపల్లి(అందోల్): ఆరుగాలం కష్టపడి పండిస్తున్న వివిధ రకాల పంటలు భారీ వర్షాల కారణంగా దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి కోసం పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని వాపోతున్నారు. భారీ వర్షాలు, ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టం వాటిల్లితే రైతులకు గతంలో పరిహారం మంజూరయేది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి (పీఎంఎఫ్‌బీవై) శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ప్రీమియం, మిగతాది రైతులు చెల్లించాల్సి ఉండేది. దీంతో పంట నష్టపోయినప్పుడు బాధిత రైతులకు పరిహారం అందేది.

ఐదు సంవత్సరాలుగా..

ఖరీఫ్ సీజన్ పంట సాగు ప్రారంభంలోనే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏటా 90 శాతం ప్రీమియం చెల్లించేవి. 5 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శించడంతో పథకానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. బీమా చేస్తే పంట నష్టం వాటిల్లినప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వచ్చి అంచనాలు వేసి బాధిత రైతులకు బీమా అందేలా చర్యలు తీసుకునే వారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో వివిధ రకాల పంటలు సుమారు 7,22,920 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

పంట	ఎకరాల్లో
పత్తి	3,16,176
చెరకు	8,973
కంది	44,755
మొక్కజొన్న	4001
సోయబీన్	46,689

ప్రభుత్వాలు ఆదుకోవాలి..



భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారం మంజూరు చేయాలి. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని పునరుద్ధరించి పంట నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలి.
– నట్కుర్ గోవింద్, రైతు హుక్రాన, మనూర్ మండలం

వివరాలు సేకరిస్తున్నాం..



భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎప్పటికపుడు పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.
– శివప్రసాద్ , జిల్లా వ్యవసాయాధికారి

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దశంకరంపేట మండలం సంగారెడ్డిపేట్‌కు చెందిన సీనియర్ నాయకులు విజయరావు, మాద్వార్ తండాకు చెందిన శంకర్‌నాయక్, కంగ్టి మండలం రాసోల్‌కు చెందిన పండరి, రాజులు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, ఖేడ్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేశ్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు జదీశ్వరాచారి, రాజు, సాయిలు, ప్రకాష్‌పటేల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



పంచాయతీ ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కల్హేర్(నారాయణఖేడ్): తాగు నీటి సమస్య పరిష్కరించాలని శనివారం సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామస్తులు శనివారం ధర్నా నిర్వహించారు. ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన దిగారు. పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య తీర్చాలని మొరపెట్టుకుంటే అసభ్యకరంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. యూత్ ఫర్ ఖాజాపూర్ బాధ్యులు శ్రీనివాస్, అంబన్న, కుమార్, హరీశ్, జహిర్ గ్రామస్తులకు మద్దతు పలికారు. సిర్గాపూర్ ఎస్ఐ మహేశ్, ఆర్ఐ మదన్ అక్కడికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీసీ కాలనీలో సింగిల్ ఫేజ్ బోరు మరమ్మతులు చేశారు. సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, లేకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.

సమైక్యత స్ఫూర్తి దసరా పండగ

ఎంపీ సురేశ్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్‌షెట్కార్

జహీరాబాద్ టౌన్: దసరా సమైక్యత స్ఫూర్తి పండగని జహీరాబాద్ ఎంపీ.సురేశ్ షెట్కార్ అన్నారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సమ్మేళనం కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా సమ్మేళనానికి అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు హాజరుకావడం మనమంతా ఒక్కటేనన్నారు. పండగలు పరస్పర గౌరవం పెంచుతాయన్నారు. దసరా సమ్మేళనం కార్యక్రమం నిర్వహించిన సమాజ్ నాయకులను అభినందించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో ఎప్పటి నుంచో అలయ్ బలయ్ సంస్కృతి ఉందన్నారు. ఒకరినొకరు గౌరవిస్తూ పండగల్లో అందరూ పాల్గొని ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన భేష్



వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

జహీరాబాద్: పట్టణంలోని మంకాల్ బ్యాంకెట్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆయా ఆస్పత్రుల ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా గ్యాస్ట్రోంటరాలజీ క్యాన్సర్ స్కానింగ్, టూడీ ఏకో, అల్ట్రా స్కానింగ్, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. పరీక్షల అనంతరం రిపోర్టులను అందజేశారు. ఆయా రోగాలకు సంబంధించిన స్పెషలిస్టులు పలు సూచనలు చేశారు. అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రాయికోడ్‌లో భారీ వర్షం



పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో శనివారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తేమ శాతం ఇప్పుడిప్పుడే తగ్గుతున్న సమయంలో మళ్లీ వర్షం కురవడంతో వరద నీరు పంట పొలాల్లో చేరింది. అతివృష్టితో వానాకాలం పంటలు కలిసిరాలేదని, యాసంగి పంటలపైనే ఆశలు పెట్టుకున్నట్లు పలువురు రైతులు అభిప్రాయపడ్డారు.

మండలంలో భారీ వర్షం



పెద్దలోడిలో పడుతున్న వర్షం

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలం పరిధి పెద్దలోడి, చీలపల్లి, గార్లపల్లిలోని కాల్వలు, వంకలు పొంగిపొర్లాయి. వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పత్తి పంట దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం



పటాన్‌చెరు టౌన్: అమ్మవారి నిమజ్జనోత్సవంలో యువకులు



సంగారెడ్డి క్రైమ్: అమ్మవారి ఊరేగింపు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సదాశివపేట: శ్రీకృష్ణనగర్ కాలనీలో..



పటాన్‌చెరు: శోభాయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నారాయణఖేడ్: కమలాపూర్ చెరువులో నిమజ్జనం చేస్తున్న దుర్గామాత విగ్రహం



సంగారెడ్డి: భవానీమాత నిమజ్జన వేడుకలు

పటాన్‌చెరు టౌన్: దేవీ శరన్నవరాత్రుల్లో విశేష పూజలందుకున్న దుర్గామాత నిమజ్జనోత్సవం శనివారం డివిజన్ పరిధిలో కనులపండువగా సాగింది. డివిజన్ పరిధిలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో ఏర్పాటు చేసిన విగ్రహం, జేపీ కాలనీ, గోకుల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతల విగ్రహాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఏడుపాయలకి యువత తీసుకెళ్లారు.

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

సంగారెడ్డి క్రైమ్: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో శనివారం అమ్మవారి శోభాయాత్ర కన్నులపండుగా సాగింది. డప్పుల చప్పులతో, ఆటాపాటలతో పురవీధులు గుండా ఊరేగించారు. దారిపొడవున మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. పలువురు కళాకారులు ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.అనంతరం నిర్వాహకులు అమ్మవారిని విగ్రహాన్ని మహబూబ్‌సాగర్ చెరువులో నిమజ్జనం చేశారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

శోభాయాత్ర ప్రారంభం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివపేట పట్టణంలో ..

సదాశివపేట(సంగారెడ్డి): దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవం శనివారం పట్టణంలోని మాడిశెట్టి రాచయ్య బావిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని గురునగర్, గాంధీచౌక్, హట్కర్‌పేట, శ్రీకృష్ణనగర్, చేన్న బసవేశ్వర మందిరం, ప్రియదర్శిని కాలనీల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా డప్పు చప్పుళ్లు, డీజేల సౌండ్స్ మధ్య యువకుల విన్యాసాలు, డ్యాన్సులతో శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో మహిళల మంగళహారతులు, కోలాహలం మధ్య మాడిశెట్టి రాచయ్య బావిలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు,

ఖేడ్ మున్సిపాలిటీలో..

నారాయణఖేడ్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఖేడ్ మున్సిపాలిటీలోని పలు వార్డులు, ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత ప్రతిమలను శనివారం మనూరు మండలం కమలాపూర్ చెరువులో నిమజ్జనం చేశారు. అర్ధరాత్రి సమయంలో శోభాయాత్రలు ప్రారంభించి తెల్లవారుజామున నిమజ్జనాలు నిర్వహించారు. నిమజ్జనాలను సజావుగా చేసేందుకు చెరువు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యుత్తుదీపాలు, క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన కార్యక్రమాలను కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

సంగారెడ్డి పట్టణంలో..

సంగారెడ్డి టౌన్: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ కాలనీల్లోని మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం శనివారం నేత్రపర్వంగా కొనసాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు ఉత్సాహంతో శోభాయాత్రలో పాల్గొనగా.. మహిళలు మంగళహారతులు, పాటలు, నృత్యాలతో అమ్మవారికి వీడ్కోలు పలికారు.

పాఠశాల తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్ లక్ష్మణ్‌నాయక్ తండా పాఠశాలను శనివారం ఎంఈఓ నాగరం శ్రీనివాస్ తనిఖీ చేశారు. పాఠశాలలో టీచర్లు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పాదయాత్ర



గణేశ్‌గడ్డకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని నవరత్నాలయ దేవస్థానం నుంచి గణేశ్‌గడ్డ సిద్ధి వినాయక దేవాలయం వరకు సాహితీ రాము గురుస్వామి ఆధ్వర్యంలో 20 మంది భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. పాదయాత్ర కేవలం ఒక ప్రయాణం మాత్రమే కాదు.. మనలో భక్తి, శక్తి, శాంతి నింపే ఆధ్యాత్మిక అనుభూతి అన్నారు. ఈ నెల 6 నుంచి కేరళలోని శబరిమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర ద్వారా అయ్యప్ప స్వామి కృపను పొందాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక భక్తులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో యాత్రికులకు వీడ్కోలు పలుకుతూ, విజయవంతంగా యాత్ర పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

రోడ్డు పరిశీలన

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని తిమ్మాయిపల్లి, హవేళీఘణాపూర్‌లలో వరదలతో కొట్టుకుపోయిన బ్రిడ్జిని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో కొట్టుకుపోయిన రోడ్ల వివరాలను తహసీల్దార్ సింధూరేణుకను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉన్న చోట తాత్కాలిక మరమ్మతులు చేసేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.